హరిహరాదుల తిరు కల్యాణోత్సవం

రంగారెడ్డినగర్: చింతల్ వేంకటేశ్వరనగర్‌లోని శ్రీహరిహర అభయాంజనేయస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్య ఆరాధన, ఆరగింపు, మంగళ శాసనం, 8 గంటలకు నిత్యహవనం, 10 గంటలకు హరిహరాదుల దశమ వార్షికోత్సవంలో భాగంగా తిరు కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు హరిహరాదుల కల్యాణమూర్తులను పల్లకీలో పుర వీధుల్లో ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ విప్ వివేకానంద్



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ విప్ వివేకానంద్

కుత్బుల్లాపూర్: విదేశీ పర్యటనను ముగించుకుని నగరానికి తిరిగి వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శనివారం బీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ శుభాకాంక్షలు తెలిపారు. విదేశీ పర్యటనలో భాగంగా కేటీఆర్ యూకే, యూఎస్ఏ దేశాలలో పర్యటించి డల్లాస్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ రవీందర్ రావు తదితరులు ఉన్నారు.

ఘన నివాళి

కుత్బుల్లాపూర్: కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ ద్వారకానగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు నార్లకంటి రాజుయాదవ్ మాతృమూర్తి శంకరమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆయన శనివారం రాజు యాదవ్ ఇంటికి వెళ్లి శంకరమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

ఆలయంలో అన్నదానం



జగద్గిరిగుట్ట: చింతల్ శ్రీ సాయి కాలనీలోని అభయాంజనేయ స్వామి, పోచమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంఘాలు అభివృద్ధికి కృషి చేయాలి



కార్పొరేటర్ శేషగిరిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: సంక్షేమ సంఘాలు స్థానిక అభివృద్ధికి కృషి చేయాలని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శనివారం జరిగిన హెచ్ఏఎల్ ఏరో నగర్ అసోసియేషన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సుపరిపాలన అందించేలా సంక్షేమ సంఘం పని చేయాలన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కార్పొరేటర్‌ను సత్కరించారు. సమావేశంలో ఉషోదయ కాలనీ ప్రెసిడెంట్ దేగల సతీష్‌బాబు, హెచ్ఏఎల్ ఏరో నగర్ ప్రెసిడెంట్ తిరుపతిరావు, సెక్రటరీ రాజ్‌గోపాల్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

నిజాంపేట్: వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండల కేంద్ర పోలీస్‌స్టేషన్‌లో అగ్రకుల ఆధిపత్యంతో ప్రేమ జంటపై దాడి చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బాలపీరు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత నెల 24న మణిరాజ్ –నితీష కులాంతర వివాహం చేసుకున్నారని, హన్మకొండ జిల్లా శాయంపేట మండల కేంద్రంలో గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఇరువురు మేజర్‌లు కావడం వల్ల పంపించారని తెలిపారు. ఆ జంటను విడదీయడానికి అమ్మాయి తండ్రి, బంధువులు పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. మణిరాజ్ బంధువులపై మూకుమ్మడి దాడి చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మళ్లీ దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

విలీనం దిశగా అడుగులు!

జీహెచ్ఎంసీలో కలవనున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు

- రింగ్‌రోడ్డు బయట ఉన్న గ్రామాలు, మున్సిపాలిటీల్లో ప్రారంభమైన వార్డుల విభజన
- ద్వితీయ శ్రేణి నాయకుల ఆశలు గల్లంతు!



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్

నిజాంపేట్: శివారు మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అందుకోసం రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న వార్డుల విభజన ప్రక్రియ పరోక్షంగా సంకేతాలు ఇస్తున్నాయి. మేడ్చల్ జిల్లాలో మొత్తం 9 మున్సిపాలిటీలు, 4 కార్పొరేషన్లు ఉన్నాయి. ఆరు నెలల నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. రింగ్ రోడ్డు లోపల ఉన్న గ్రామ పంచాయతీలను సైతం ప్రభుత్వం సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 2009లో ఏర్పడింది. అప్పట్లో కుత్బుల్లాపూర్ సర్కిల్‌తో పాటు మండల ప్రాంతంలో 11 గ్రామ పంచాయతీలు ఉండేవి. కానీ 2019లో ఈ గ్రామ పంచాయతీలను కలిపి నిజాంపేట్ కార్పొరేషన్‌గా, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి గ్రామీన స్వరూపం మొత్తం మారిపోయింది. ఈ సంవత్సరం జనవరి నుంచి మున్సిపాలిటీల, పాలక వర్గాల పదవి కాలం ముగిసింది. కానీ ప్రభుత్వం జీహెచ్ఎంసీలో వీటిని విలీనం చేస్తే కుత్బుల్లాపూర్ నియోజకవర్గం స్వరూపం సైతం పూర్తి స్థాయిలో మారిపోయే అవకాశం ఉంది.

వార్డుల విభజన ప్రారంభం!

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో వార్డుల విభజన చేస్తుంది. దీంతో మేడ్చల్ జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన రింగ్ రోడ్డు బయట ఉన్న మూడు చింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మున్సిపాలిటీలల్లో మాత్రమే వార్డుల విభజన జరుగుతుంది. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్న గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. కానీ అక్కడ ఎలాంటి వార్డుల విభజన జరగడం లేదు. అదే విధంగా గతంలోని మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లల్లో సైతం ఎక్కడ ఈ ఊసే లేదు.

డివిజన్ల సంఖ్య తగ్గే అవకాశం

ప్రస్తుతం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లల్లో 33 వార్డులు, కొంపల్లి మున్సిపాలిటీలో 18, దుండిగల్ మున్సిపాలిటీలో 28 వార్డులు ఉన్నాయి. ఒక వేళ ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే డివిజన్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీలో ఒక్కో డివిజన్‌కు ఎన్ని వేల మంది ఓటర్లు లెక్కలోకి తీసుకుంటారనేది తెలియాల్సి ఉంది. 20 వేల నుచి 30 వేల మధ్యలో ఓటర్లను ఒక్కో డివిజన్‌కు విభజించే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో డివిజన్ల సంఖ్య తగ్గి నాయకుల మధ్య తీవ్ర పోటీ నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ మూడింటిలో మొత్తం సుమారు 15 వరకు డివిజన్లు ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వీటిని గతంలో ఉన్న డివిజన్లు అయిన గాజులరామారం జీడిమెట్ల, సూరారం, ఇటు హైదర్ నగర్, మియాపూర్ తదితర ప్రాంతాలను తెక్కలోకి తీసుకుని విభజిస్తే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

నాయకుల ఆశలపై నీళ్లు

మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసి ప్రజాప్రతినిధులుగా గెలుపొందాలని అన్ని పార్టీలల్లో ద్వితీయ శ్రేణి నాయకులు ఎంతో కాలంగా ఆయా పార్టీల్లో కష్టపడి పని చేస్తున్నారు. ప్రభుత్వం గ్రేటర్‌లో విలీనం చేస్తే ద్వితీయ శ్రేణి నాయకులకు టిక్కెట్లు దక్కడం అన్ని పార్టీల్లోను కష్టమే. కేవలం పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా, కార్పొరేషన్లుగా ఏర్పడిన ప్రాంతాలను కేవలం ఒక్క దఫాకే జీహెచ్ఎంసీలో విలీనం చేయడం ఎంతవరకు సమంజసమని పలు పార్టీల నాయకులు వాపోతున్నారు.

ఉప కమిషనర్ ఫిర్యాదు.. కేసు నమోదు

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు ఇద్దరు భవన యజమానులపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్‌గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం .. చింతల్ ప్రధాన రోడ్డులో శైలజ, సంధ్యారాణి అనే ఇద్దరు స్థల యజమానులు రెసిడెన్షియల్ అనుమతులు పొంది కమర్షియల్ నిర్మాణం చేపట్టారు. ఈ విషయమై ఉప కమిషనర్ నర్సింహకు ఫిర్యాదు అందటంతో ఆయన ఇటీవల బిల్డింగ్‌ను సీజ్ చేశారు. కొద్దిరోజులు బిల్డింగ్ నిర్మాణాలు నిలిపివేసిన ఇంటి యజమానులు.. అధికారులకు తెలియకుండా బిల్డింగ్ పనులు ప్రారంభించారు. ఈ విషయమై ఉప కమిషనర్ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఇంటి యజమానులు సంధ్యారాణి, శైలజలపై కేసు నమోదు చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి సురేశ్ థియేటర్ సమీపంలోని శ్రీగిరి జ్యోతిష్యాలయంలో ఈనెల 8, 9తేదీల్లో చేపమందు ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్టు నిర్వాహకుడు శంకర్‌ముఖియా తెలిపారు. చేపమందు పంపిణీ పోస్టర్‌ను రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌తో కలిసి ఆయన విష్కరించారు. 8న ఉదయం రాజ్యసభ సభ్యుడు అనిక్ కుమార్‌యాదవ్, కార్పొరేటర్ సామల హేమ, శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ నోముల ప్రకాశ్‌రావులు ముఖ్యఅతిథులుగా హాజరై చేపమందు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

బీజేపీ ప్రగతినగర్ కార్యవర్గం ఎన్నిక

నిజాంపేట్: బీజేపీ ప్రగతినగర్ కార్యవర్గాన్ని అధ్యక్షులు నరేంద్ర చౌదరి శనివారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా మదన్‌మోహన్‌గౌడ్, సాకి కిషోర్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, మైలవరం అశోక్, శివకుమార్ గుప్తా, నల్లమోతు నరేష్, కార్యదర్శులుగా నాగార్జున (అర్జున్), విత్తనాల సతీష్ విజం రామకృష్ణ, లక్ష్మీ, కార్యదర్శి, ట్రెజరర్‌గా రవి 11మందితో కూడిన కార్యవర్గం, వివిధ మోర్చాల అధ్యక్షులను ప్రకటించారు. మహిళా మోర్చా మోక్షశ్రీ, ఓబీసీ మోర్చా వేణు, యువ మోర్చా అనిరుద్ర, ఎస్టీ మోర్చా రఘు, మైనార్టీ మోర్చా భారతిజైన్‌లను ప్రకటించారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

బీజేపీ దుండిగల్ మున్సిపల్ కార్యవర్గం...

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ పూర్తి స్థాయి కమిటీని శనివారం అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా దమ్మగారి సీతారామిరెడ్డి, తురాయి భానుగౌడ్, కోశాధికారిగా కొమ్ము ప్రశాంత్, కార్యదర్శులుగా ఎస్ లత, రాజ్ కుమార్‌ముదిరాజ్, నర్సింహా చారి, మాలోత్ శివ నాయక్, కమిటీ సభ్యులుగా నడికట్ల రోజా, ఎంబరి అంజనేయులు, ఆకినబోయిన సాయియాదవ్‌లకు నియామక పత్రాలు అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కృష్ణారెడ్డి కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విగ్నేశ్వర్‌చారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు దాసరి శ్యామ్‌రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ మల్లేష్‌యాదవ్, సీనియర్ నాయకులు శ్రీశైలం యాదవ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ చింతల్ డివిజన్ కమిటీ నియామకం



కోడి ఆదిత్య, బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు

చింతల్: బీజేపీ డివిజన్ కమిటీని అధ్యక్షుడు రాజేష్‌చారి ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, రామసాయి యాదవ్, ఉపాధ్యక్షులుగా యాదిలాల్ నరసింహగౌడ్, రాజ్‌కుమార్, శ్యామ్‌రెడ్డి, సెక్రటరీలుగా రామకృష్ణ, ఎల్.వి.రెడ్డి, మన్యంకుమార్, రజిత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దావత్ శ్రీనివాస్‌లను నియమించారు. అదే విధంగా బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడిగా కోడి ఆదిత్యను నియమించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజా సదానంద్, భానుచందర్ వర్మ, మహిపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ప్రయాణికురాలికి బంగారం, నగదు అప్పగింత

సికింద్రాబాద్: రైలు ప్రయాణం ద్వారా నగరానికి చేరుకున్న ఒక మహిళా ప్రయాణికురాలు స్టేషన్‌లో మరిచిపోయిన బ్యాగును అందులోని నగదు, ఆభరణాలను ఆర్పీఎఫ్ పోలీసులు శనివారం ఆమెకు అప్పగించారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సారస్వత్ తెలిపిన మేరకు... ఈనెల 6న నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలులో జకియాబేగం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. స్టేషన్ నుంచి బయటకు బయటకు వెళ్లే హడావుడిలో తన లగేజీ బ్యాగులను స్టేషన్‌లోనే మరిచి పోయింది. స్టేషన్ విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ బృందం సదరు లగేజీ బ్యాగులను భద్రపరిచారు. అందులో లభించిన గుర్తింపు కార్డుల ఆధారంగా ప్రయాణికురాలికి సమాచారం అందించారు. ఆర్‌పీఎఫ్ స్టేషన్‌కు ప్రయాణికురాలిని రప్పించిన పోలీసులు బ్యాగులతోపాటు అందులోని రూ.7 లక్షల విలువ చేసే నక్లెస్, ఉంగరాలు, గొలుసు తదితర బంగారు ఆభరణాలు, రూ.29 వేల నగదును అందించారు.

యువకుడిని రక్షించిన ఆర్‌పీఎఫ్

సికింద్రాబాద్–లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య ఆత్మహత్యకు యత్నించిన ఒక యువకుడిని ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం రక్షించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో రైల్వే ట్రాక్ పక్కనే తచ్చాడుతున్న ఒక యువకుడిని విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. రైలు వస్తున్న సమయంలో ట్రాక్ మీదకు వెళ్లేందుకు ప్రయత్నించిన అతనిని పోలీసులు పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ఈద్గాలు, మజీద్‌ల వద్ద ప్రార్థనలు

నిజాంపేట్: ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే పండుగల్లో ముఖ్యమైనది బక్రీద్. మానవుడు దైవమార్గంలో తన సర్వస్వాన్ని త్యజించి, దైవాన్ని విశ్వసించి, మానవులంతా ఒకటేనని నమ్మి త్యాగనిరతిని చూపించాలన్నదే బక్రీద్ యొక్క సందేశం. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను ముస్లింలు శనివారం నియోజకవర్గం పరిధిలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ప్రార్థనల్లో పాల్గొని, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలువురు రాజకీయ నాయకులు సైతం ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నపిల్లలు నుంచి వృద్ధుల వరకు బక్రీద్ ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఐలయ్యగౌడ్

జగద్గిరిగుట్ట: బక్రీద్ సందర్భంగా జగద్గిరిగుట్టలో ముస్లింలు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్‌ను కలిశారు. ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనార్ధన్, కాజుద్దీన్, ఎండీ ఇక్బాల్, ఎండీ సయ్యద్ పాల్గొన్నారు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

నిరంతరం కార్మికుల పక్షం



కూన శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న కార్మికులు

కుత్బుల్లాపూర్: నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఫ్లెమింగ్ లేబొరేటరీస్ కార్మికులు శనివారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో ఆయనను కలిశారు. నూతన వేతన ఒప్పందం కుదుర్చిన సందర్భంగా సన్మానించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో కార్మికులకు మెరుగైన వేతనంతో పాటు ఇతర అలవెన్స్‌లు కల్పించేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ అడ్వైజర్ మల్లేశం, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సనత్‌నగర్: ప్రమాదవశాత్తూ బైక్‌పై నుంచి కిందపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..ఎంఎస్ మక్తాకు చెందిన సూర్యరాజ్ (39) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 4వ తేదీన అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై సికింద్రాబాద్ వైపు నుంచి బేగంపేట వైపు వస్తూ మహర్షి కళాశాల సమీపంలో వాహనం అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో బాధితుడిని 108 అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సూర్యరాజ్ మృతి చెందాడు. ఈ మేరకు సూర్యరాజ్ బంధువైన సుధాకర్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతున్న మామా అల్లుళ్లను ఢీకొట్టిన కారు

సనత్‌నగర్: రోడ్డు దాటుతున్న మామా అల్లుళ్లను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన షేక్ ఇనాయత్, అతనికి వరుసకు అల్లుడు అయిన షేక్ ఎలియాస్‌లు ఈ నెల 5న ఎర్రగడ్డ జెకే పాయింట్ హోటల్ నుంచి సనతనగర్ రోడ్డు వైపు వెళ్లేందుకు ఎర్రగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నారు. ఎస్సార్‌నగర్ నుంచి భరత్‌నగర్ వైపు అతివేగంగా వచ్చిన మారుతి టూర్–హెచ్3 కారు డ్రైవర్ వారిని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీరు గాయాలకు గురికావడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. వీరిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వీరిని ఢీకొన్న డ్రైవర్ అభిలాష్‌గా గుర్తించారు. అతని చర్యలు తీసుకోవాల్సిందిగా షేక్ ఇనాయత్ కుమార్తె రుక్యాబేగం శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పూల సోయగం..



ప్రకృతి అంటేనే పచ్చని చెట్లు, పచ్చిక బయళ్లు, ఆకర్షించే రంగురంగుల పూలు. వర్షాకాలం ప్రారంభం అయ్యిందంటే ప్రకృతి చాలా అందంగా కనిపిస్తుంది. అదే నగరంలో కనిపిస్తే మరింత అద్భుతంగా ఉంటుంది కదూ.. జీడిమెట్ల ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో ఉండే ప్రశాంతవనం పార్కులో వర్షాకాలం కావడంతో రంగురంగుల పూలు వాకర్స్‌ను ఆకర్షిస్తున్నాయి. దీంతో చాలా మంది వాకర్స్ ప్రకృతిలో ఫొటోలు తీసుకుని కెమెరాల్లో దాచుకుంటున్నారు. –జీడిమెట్ల





ఆదాయం ఉన్నా గుంతల రోడ్లే!

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

సుభాష్‌నగర్: చిన్న చిన్న గ్రామాల్లో సైతం పక్క సీసీ రోడ్లు ఉంటే ఇక్కడ కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి వస్తున్న స్థానికంగా మాత్రం ఇంకా బురద రోడ్లే దర్శనమిస్తున్నాయి. కొంపల్లి మున్సిపల్‌లో ప్రతి సంవత్సరం అధికంగా పన్ను రూపకంలో ఆదాయం వస్తుందంటే జీడిమెట్ల పారిశ్రామిక వాడనే అని చెప్పవచ్చు. స్థానికంగా జీడిమెట్ల పారిశ్రామిక వాడను, ఫాక్‌సాగర్‌ను అనుకొని వందల సంఖ్యలో వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమంలో వందలాది సంఖ్యల్లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు ఉపాధి పొందుతున్నారు. గడచిన పదేళ్లలో వందల సంఖ్యలో పరిశ్రమలు రావడంతో అదే స్థాయిలో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల్లో ఆదాయం వస్తుంది. కానీ సంబంధిత అధికారులు కనీస వసతులు కల్పించిన పాపను పోలేదు. పారిశ్రామిక వాడలో ఇంకా మట్టి రోడ్లే ఉన్నాయి. నిత్యం స్థానికంగా కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి టన్నుల కొద్ది ముడి సరుకుతో కూడిన భారీ వాహనాలు ఈ పారిశ్రామిక వాడకు వస్తుంటాయి. ఇటీవల వర్షాలు పడటంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వాహన దారులు పడరాని పాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు కనీసం ఇప్పటికైనా ఆ గుంతల్లో మట్టి పోసిన దాఖలాలు లేవు.



దారుణంగా రోడ్లు

వాహనదారులకు ఇబ్బందులు

కోట్లాది రూపాయల ఆదాయాన్ని ఇస్తున్న దూలపల్లి పారిశ్రామికవాడకు నిత్యం వివిధ రాష్ట్రాల నుండి భారీ వాహనాలు వస్తూ ఉంటాయి. అందుకు అనుగుణంగా పటిష్టమైన రోడ్లు, సూచిక బోర్డులు, వాహనాల పార్కింగ్, ఇతర సదుపాయాలు కల్పించాలి. కానీ సంబంధిత అధికారులు ఏనాడు ఆ దిశగా పనిచేసిన దాఖలాలు లేవు. దీంతో స్థానికంగా పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది.



పరిశ్రమల నుండి కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. కనీసం అందులో కొంత అయినా ఖర్చు పెట్టి ఏనాడు రోడ్లు కానీ, ఇతర సదుపాయాలు కల్పించకపోవడం దారుణం. ఇక వర్షాకాలంలో పరిశ్రమలకు వచ్చే వాహనదారుల ఇబ్బందులు చూస్తుంటే ఎంతో బాధ వేస్తుంది. నేను వార్డు మెంబర్‌గా ఉన్నప్పుడు ఈ సమస్యపై మాట్లాడినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశ్రమల నుంచి వచ్చే ఆదాయాన్ని అక్కడే అభివృద్ధి పనులకు కేటాయించాలి.
- గరిసె సతీష్, మాజీ బోర్డు సభ్యుడు